క్లుప్తంగా

ఎస్సీ మోర్చా ఇన్‌చార్జ్‌గా శ్రీనివాస్

చిట్యాల: యాదాద్రి భువనగిరి జిల్లా బీజేపీ ఎస్సీ మోర్చా ఇన్‌చార్జ్‌గా చిట్యాల పట్టణానికి చెందిన మాస శ్రీనివాస్‌ను నియమిస్తూ ఆ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నకిరేకంటి మొగులయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్‌గా జయమ్మ



మునుగోడు: మండలంలోని ఊకొండి గ్రామ పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం చైర్మన్, డైరెక్టర్ల ఎన్నికలను సోమవారం నిర్వహించారు. చైర్మన్‌గా కమ్మంపాటి జయమ్మ ఎన్నికయ్యారు.

ఆలయ కమిటీ ఎన్నిక

నకిరేకల్ : మున్సిపాలిటీలోని సంతోష్‌నగర్‌లో వెలిసిన శ్రీ కాళికామాత ఆలయంలో అమ్మవారికి ఈ నెల 21 బోనాలు నిర్వహించనున్న నేపథ్యంలో ఆలయ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా యల్లపురెడ్డి యాదగిరెడ్డి, గౌరవ సలహాదారులుగా బ్రహ్మదేవర రవిశంకర్, కందాల లక్ష్మీనారాయణరెడ్డి, గర్రె మురళి, ప్రధాన కార్యదర్శిగా గోకికార పరమేష్, ఉపాధ్యక్షులుగా చెంచల యాదగిరి, పగిళ్ల వెంకన్న, ఏశబోయిన యాదయ్య, మేకల దేవయ్య, బచ్చు శ్రీనివాస్, కోశాధికారిగా లగిశెట్టి సత్యనారాయణ, సహాయ కోశాధికారిగా అప్పం సతీష్‌కుమార్, సహాయ కార్యదర్శులుగా బడుగుగౌర్ల సుజాత, కొమరయ్యతోపాటు మరో 10 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

రేషన్ దుకాణం ప్రారంభం

నకిరేకల్ : మండలంలోని చందుపట్ల గ్రామంలో రేషన్ షాప్–1 ను సోమవారం స్థానిక ఎంపీటీసీ ఇమడపాక లక్ష్మీవెంకన్న ప్రారంభించారు. కార్యక్రమంలో రేషన్ డీలర్స్ అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు సాజిత్, మండల అధ్యక్షుడు మునీందర్‌రావు, డీలర్ కొల్లు మహేష్, జిల్లా శ్రీను, బెజవాడ లక్ష్మీనారాయణ, కోటగిరి రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మోతీలాల్ దీక్షకు నిరుద్యోగుల మద్దతు

రామగిరి(నల్లగొండ): గ్రూప్–2,3 పోస్టులను పెంచాలని మోతీలాల్ చేస్తున్న దీక్షకు మద్దతుగా నిరుద్యోగులు సోమవారం జిల్లా కేంద్ర గ్రంథాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీఎస్సీ వాయిదా వేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.హరీష్, కిరణ్, జి.వేణు, యుగేందర్, రమేష్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

నల్లగొండ టౌన్ : ప్రకాశం జిల్లా ఈదుమూడి గ్రామంలో ఈ నెల 7న జరిగే మాదిగ జన జాతర సభకు జిల్లా నుంచి మాదిగలు భారీ సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్‌మాదిగ, వర్కింగ్ ప్రెసిడెంట్ చేకూరి గణేశ్‌మాదిగ పిలుపునిచ్చారు. సోమవారం స్థానికంగా జాతర పోస్టర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు.

భూ యాజమాన్య హక్కులు కల్పించాలి

కేతేపల్లి: రాష్ట్రంలో ఏళ్ల తరబడి ప్రభుత్వ భూములను సేద్యం చేసుకుంటూ పట్టాలు పొందని రైతులకు ప్రభుత్వం వెంటనే భూ యాజమాన్య హక్కులు కల్పించాలని ప్రజాపోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని బొప్పారం గ్రామంలో నిర్వహించిన భూ సాధన సమితి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

జింకలు పంటలను నాశనం చేస్తున్నాయని ఫిర్యాదు

మర్రిగూడ : రైతులు సాగు చేసిన పంటలను జింకలు తొక్కి నాశనం చేస్తున్నాయని, వాటిని అటవీ ప్రాంతానికి తరలించాలని కోరుతూ ఎంపీటీసీ సిలివేరు విష్ణు సోమవారం నల్లగొండలో అటవీశాఖ సూపరింటెండెంట్ రఘువీర్ ప్రతాప్‌ను కలిసి సమస్యను వివరించారు. దామెరబీమనపల్లి, కమ్మగూడ, లెంకలపల్లి, సరంపేట, రాంరెడ్డిపల్లి, తానేదారుపల్లి తోపాటు పరిసర ప్రాంతాల్లో జింకల బెడద అధికంగా ఉందన్నారు.

పెన్షన్ ఇవ్వాలి

నల్లగొండ టౌన్ : యాభై సంవత్సరాలు నిండిన భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా నెలకు రూ.6 వేల పెన్షన్ ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఆర్థికసాయం అందజేత

చిట్యాల: మున్సిపాలిటీలోని రెండో వార్డుకు చెందిన పొన్నాల మంగమ్మ మనవడు రాఖీ అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఆ బాలుడి వైద్య చికిత్సకుగాను నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పంపిన రూ.10 వేల ఆర్థికసాయాన్ని సోమవారం డీసీసీ కార్యదర్శి పోకల దేవదాసు, మాజీ ఎంపీటీసీ ఎద్దులపురి కృష్ణ అందజేశారు. కౌన్సిలర్ కోనేటి కృష్ణ, పరమేష్, గోవర్ధన్, రాంరెడ్డి, మల్లేష్, అశోక్, శ్రీనివాస్‌చారి, శేఖర్, దుర్గయ్య పాల్గొన్నారు.

వేధిస్తున్న డ్రెయినేజీ సమస్య



కల్మెర రోడ్డులో డ్రెయినేజీ లేక రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



సర్వీస్ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

- రోడ్డుపై నిలుస్తున్న మురుగు నీరు
- ఇబ్బందులు పడుతున్న కట్టంగూర్ ప్రజలు

కట్టంగూర్ : మండలకేంద్రంలో జాతీయ రహదారి నుంచి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే బాట వరకు గల కల్మెర రోడ్డు వెంబడి డ్రెయినేజీ లేక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డుకు ఒక వైపు డ్రెయినేజీ లేకపోవడంతో ఇళ్లలోని వ్యర్థపు నీరు రోడ్డుపై నిలుస్తోంది. దానికితోడు వర్షపునీరు కూడా రోడ్డుపై నిల్వ ఉండి రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. కల్మెర రోడ్డులోని కృష్ణాజలాల మినీ ట్యాంకు సమీపంలో, ఏపీజీవీబీ సమీపంలో రోడ్డుపై వర్షపు నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది.

నిత్యం రాకపోకలతో రద్దీ..

ఇదే రోడ్డు వెంబడి రెండు వైన్స్ దుకాణాలు ఉండడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ రోడ్డు గుండా మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు పలు పనుల నిమిత్తం తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, పోస్టాఫీస్‌కు రాకపోకలు సాగిస్తుంటారు. ఈదులూరు, పరడ, పందెనపల్లి, కల్మెర, మునుకుంట్ల, కుమ్మరిగూడెం, తక్కెళ్లపాడుతోపాటు శాలిగౌరారం మండల ప్రజలు ఈ దారిగుండా నల్లగొండకు రాకపోకలు సాగిస్తారు. రాత్రిపూట ఈ దారి గుండా వెళ్లేందుకు వాహనదారులు జంకుతున్నారు. పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలనకే పరిమితమయ్యారు తప్ప పనులు మాత్రం చేపట్టడం లేదని ఆ ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు చొరవ చూపి డ్రెయినేజీ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

సర్వీసు రోడ్డుపై నీటితో ఇబ్బందులు

జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కట్టంగూర్‌లో సర్వీసు రోడ్డు వెంబడి నిర్మించిన డ్రెయినేజీ ఎత్తుగా ఉండడంతో వర్షపు నీరు రోడ్డుపై నిల్వ ఉంటోంది. మసీదు ప్రాంతంలో డ్రెయినేజీ అసంపూర్తిగా నిర్మించడంతో ప్రజలు పదకొండు సంవత్సరాలుగా నానా అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రంలో సర్వీసు రోడ్డుపై వర్షపు నీరు నిల్వ ఉండి దారిగుండా వెళ్లే ప్రజలు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అసలే వర్షాకాలం కావడంతో కొద్దిపాటి వర్షం కురిసినా వారం రోజుల పాటు సర్వీసు రోడ్డు పక్కనే నీరు నిల్వ ఉంటోంది. నిల్వ ఉన్న నీరు దోమలకు ఆవాసంగా మారి ప్రజలు రోగాలబారిన పడే ప్రమాదం ఉంది. సర్వీసు రోడ్డుపై ఎదురెదురుగా రెండు వాహనాలు వెళ్లేటప్పుడు ద్విచక్ర వాహనదారులపై, రోడ్డు పక్కనే వెళ్లే ప్రజలపై బురద నీరు పడుతోంది.

డ్రెయినేజీ నిర్మించాలి



మండల కేంద్రంలోని కల్మెర రోడ్డు వెంబడి డ్రెయినేజీ లేక మురుగు రోడ్డుపై నిలుస్తోంది. వర్షాకాలంలో నీరు రోడ్డుపై నిలిచి గుంతలు ఏర్పడి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ రోడ్డుకు రెండు వైన్ షాప్‌లు ఉండడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ నిర్మించాలి.

– మాదగోని బాలు, కట్టంగూర్

ఆదర్శ నియోజకవర్గంగా అభివృద్ధి చేస్తా

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నల్లగొండ రూరల్ : సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ రూరల్ : నల్లగొండ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా అభివృద్ధి చేస్తానని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండ ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధితోపాటు నియోజకవర్గ అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అధికారులు మరింత కష్టపడి పనిచేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి ముందుకు సాగుతుందన్నారు. బి వెల్లెంల ప్రాజెక్టు పూర్తి చేసి ఏఎమ్మార్పీకి ఎగువ భాగాన ఉన్న గ్రామాలకు సాగునీటి కష్టాలు లేకుండా చేస్తామన్నారు. విద్యుత్ లోఓల్టేజీ సమస్య రాకుండా చూడాలని, కాల్వలకు, రోడ్లకు మరమ్మతులు చేయాలని ఆదేశించారు. నల్లగొండ మండలంలో మరో 10 విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేసి లోఓల్టేజీ సమస్య లేకుండా చేస్తామన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో కనీస మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, అవసరమైన భవనాలు నిర్మించాలని, అందుకు అధికారులు ప్లానింగ్ ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం ఎంపీటీసీలను సన్మానించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, ఎంపీపీ సుమన్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ సందీప్ రెడ్డి, ఉద్యాన అధికారి అనంతరెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని..

మండల మహిళా సమాఖ్య కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ సోమవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి మహిళా సమాఖ్య ఉద్యోగులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పబ్బిల్ల శ్రీశైలం, పోతెపాక అంజలి తదితరులు ఉన్నారు.

హౌజింగ్ బోర్డు ఇళ్లు ఇప్పించాలని...

నల్లగొండ రూరల్ : నల్లగొండ పట్టణంలోని దేవరకొండ రోడ్డులో గల మహబూబ్‌నగర్ హౌజింగ్ బోర్డుకు ఇళ్ల కోసం డబ్బులు చెల్లించామని, నేటికీ తమకు ఇళ్లు కేటాయించలేదని బాధితులు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి సోమవారం వినతిపత్రం ఇచ్చారు. 2010 సెప్టెంబర్ 16న ఇళ్ల కోసం నోటిఫికేషన్ ఇచ్చారని హెచ్‌ఐజీ–2కి 152 మంది డబ్బులు చెల్లించగా కేవలం 50 మందికి ఇళ్లు కేటాయించారని మరో 100 మందికి ఇళ్ల కేటాయింపు జరగలేదని తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో అనురాధ, సరిత, అండాలు, లక్ష్మి, సునిత తదితరులు ఉన్నారు.

బస్సులు నడపాలని..

శాలిగౌరారం: ఆర్టీసీ బస్సులను శాలిగౌరారం మండలానికి నడపాలని కోరుతూ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి సోమవారం వినతిపత్రం అందజేశారు. నకిరేకల్ నుంచి శాలిగౌరారం, అడ్లగూగూరు మీదుగా, తిరుమలగిరికి, అమ్మనబోలు మీదుగా మోత్కూరుకు, అదేవిధంగా నకిరేకల్ నుంచి ఆకారం వరకు ప్రత్యేక బస్సులు నడుపాలని కోరారు. బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బందులు పడతున్నారని తెలిపారు. ఆయనవెంట షేక్ ఇంతియాజ్, చింత ధనుంజయ్య ఉన్నారు.

ప్రజలందరికీ సమాన అవకాశాలు కల్పించాలి



మాట్లాడుతున్న ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

నల్లగొండ టౌన్ : సమాజంలో ప్రజలకు సమాన అవకాశాలు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానికంగా ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన నల్లగొండ నియోజకవర్గ రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. తరతరాలుగా సమాజంలో అసమానతలు సృష్టిస్తూ మనిషిని మనిషి దోపిడీ చేసే వ్యవస్థ పోవాలన్నారు. దేశంలో నేటికీ గూడులేని ప్రజలు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అంటగట్టే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ప్రజలు చైతన్యవంతమై సమస్యలపై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం పార్టీ రాష్ట్ర నాయకులు మిరియం వెంకటేశ్వర్లు, సోమయ్య తరగతులను కొనసాగించారు. కార్యక్రమంలో పాలడుగు నాగార్జున, సయ్యద్ హాషం, ఎండీ సలీం, దండెంపల్లి సత్తయ్య, నన్నూరి వెంకటరమణారెడ్డి, తుమ్మల పద్మ, కొండ అనురాధ, మన్నెం భిక్షం, కందుల సైదులు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

శాలిగౌరారం: సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని లయన్స్ క్లబ్ నల్లగొండ, ఖమ్మం జిల్లాల రెండో గవర్నర్ కేవీ ప్రసాద్ అన్నారు. శాలిగౌరారం లయన్స్ క్లబ్ రెండో చార్టర్ నైట్, మూడో నూతన కార్యవర్గ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం రాత్రి జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నూతన అధ్యక్షుడిగా డెంకల సత్యనారాయణతోపాటూ కార్యవర్గాన్ని ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. లయన్స్‌క్లబ్ పాస్ట్ గవర్నర్ గ్యాట్ అంబాసిడర్ తమ్మతపెల్లి కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి సింహాద్రి శివశంకర్, కోశాధికారి తుమ్మలూరి మురళీధర్‌రెడ్డి, జెల్లా దశరథ, ప్రకాశ్, రవీందర్‌రావు, వెంకటేశ్వరరావు, అనంతరెడ్డి, ప్రసాద్, శంభులింగారెడ్డి, అశోక్, వెంకటరమణ, పుల్లారావు, రాంరెడ్డి, శ్రీనివాస్, అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి మారోజు వెంకటాచారి, కోశాధికారి వడ్లకొండ భిక్షం, ప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న శాలిగౌరారం లయన్స్ క్లబ్ సభ్యులు

కాంగ్రెస్ పార్టీలో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న గుమ్మల మోహన్‌రెడ్డి

నల్లగొండ: మండలంలోని పెద్ద సూరారం గ్రామానికి చెందిన పలువురు సీపీఎం, బీఆర్ఎస్ పార్టీల నాయకులు సోమవారం కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరినవారిలో మాజీ ఉప సర్పంచ్ గుండె వెంకన్న, మాజీ ఎంపీటీసీ సైదులు, యాదయ్య, వాసు, సైదులు, శివ, యాదయ్య, హరీష్, హరి, ఆనందం, యాదయ్య, వెంకన్న, చిన్న సైదులు, నరసింహ, వీరయ్య, నాగేష్, నాగయ్యలు ఉన్నారు. అనంతరం పార్టీలో చేరిన వారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిశారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె

చండూరు: పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ కార్మికులు సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట సమ్మెకు దిగారు. కార్యక్రమంలో వెంకన్న, సైదులు, లింగస్వామి నాగరాజు, కలమ్మ, రమణమ్మ, యాదయ్య పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

మునుగోడు: మండలంలోని రావిగూడెం గ్రామంలో అక్రమంగా నిల్వ ఉన్న మద్యం పట్టుకుని సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సోమవారం మునుగోడు పోలీసులు తెలిపారు. వివరాలు.. మండలంలోని రావిగూడెంలో సత్తయ్య అనే వ్యక్తి నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు కొనసాగిస్తున్నాడనే సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో సత్తయ్య ఇంట్లో నిల్వ ఉన్న రూ.6732 విలువ గల ఆరు లీటర్లకు పైగా మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సత్తయ్యను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నార్కట్‌పల్లి : పంటలకు కనీస మద్దతు ధర చట్టం చేయాలని కోరుతూ సీపీఎం, కేవీపీఎస్ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. నల్లబ్యాడ్జీలు, బ్యానర్లతో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా నాయకుడు ఎస్ఆర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలు, పెట్టుబడులను పరిగణనలోకి తీసుకొని మద్దతు ధర ప్రకటించాలన్నారు. రైతు భరోసా వెంటనే రైతు ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. మండల కార్యదర్శి చెరుకు పెద్దులు, వైస్ ఎంపీపీ కల్లూరి యాదగిరి, ఐతరాజు నర్సింహ, కుమ్మరి శంకర్, రవి, యాదగిరిరెడ్డి, నాగరాజు, శ్రీను, అలుగుబెల్లి లింగారెడ్డి, లింగయ్య ఉన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

చండూరు : ప్రతినెలా 20 మంది నిరుపేదలకు రూ.వెయ్యి చొప్పున సరుకులు పంపిణీ చేసే కార్యక్రమంలో భాగంగా ట్రస్మా జిల్లా అధ్యక్షుడు, గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు సోమవారం గ్రామీణ వైద్యుల ఆధ్వర్యంలో సరుకులు అందజేశారు. ఆర్ఎంపీలు రమేష్, నర్సింహ, రవి, వెంకట్, రాంప్రసాద్, చేనేత పరిరక్షణ సమితి అధ్యక్షుడు ప్రభాకర్, డైరెక్టర్ సరికొండ వెంకన్న, ప్రిన్సిపాల్ సత్యనారాయణమూర్తి, సమత, కోడి ప్రీతి, యాదగిరి, బోడ విజయ్ పాల్గొన్నారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి



నకిరేకల్ : దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు



కేతేపల్లి : సమస్యలు తెలుసుకుంటున్న మిషన్ భగీరథ ఎస్ఈ వెంకటేశ్వర్లు



గట్టుప్పల్‌లో ప్రజావాణిలో పాల్గొన్న డీపీఓ మురళి

చండూరు(గట్టుప్పల్): ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చేపట్టిన ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీపీఓ మురళి అన్నారు. సోమవారం గట్టుప్పల్ మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. తహసీల్దారు రాములు, కార్యదర్శి షఫి, అధికారులు పాల్గొన్నారు.

నకిరేకల్‌లో 45 దరఖాస్తులు

నకిరేకల్ : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. వివిధ విభాగాలకు సంబంధించి మొత్తం 45 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, తహసీల్దార్ జమురుద్దీన్, మున్సిపల్ కమిషనర్ బాలయ్య, ఎంఈఓ నాగయ్య, ఏఈ సాయిగణేష్ తదితరులు పాల్గొన్నారు.

చిట్యాలలో 32 దరఖాస్తుల స్వీకరణ

చిట్యాల: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొత్తంగా 32 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. వీటిలో 29 దరఖాస్తులు వివిధ గ్రామాలకు సంబంధించినవి కాగా 3 దరఖాస్తులు చిట్యాల మున్సిపాలిటీకి చెందినవి ఉన్నాయి. 25 రెవెన్యూ సమస్యలకు సంబంధించినవి, 7 దరఖాస్తులు ఆసరా పింఛన్ల కోసం ప్రజాపాలనలో ఇచ్చిన దరఖాస్తులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి శ్రవణ్‌కుమార్, ఎంపీడీఓ జయలక్ష్మి, తహసీల్దార్ కృష్ణ, మున్సిపల్ మేనేజర్ నుజాహారత్‌తోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేతేపల్లిలో 19 దరఖాస్తులు

కేతేపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు సోమవారం ప్రజావాణి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ సమస్యలకు సంబంధించి ప్రజల నుంచి మొత్తం 19 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. ఇందులో రెవెన్యూ సమస్యలకు సంబంధించి 18, పంచాయతీరాజ్‌కు సంబంధించి ఒక దరఖాస్తు వచ్చినట్లు పేర్కొన్నారు. దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని మిషన్ భగీరథ ఎస్ఈ వెంకటేశ్వర్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, తహసీల్దారు మధుసూదన్ రెడ్డి, ఎంపీఓ నాగమణి, ఏఓ బి.పురుషోత్తం, మండల వైద్యాధికారి అర్చన, ఐకేపీ ఏపీఎం బి.యాదమ్మ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించాలి

కట్టంగూర్ : ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్న వారి సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రెవెన్యూకు సంబంధించి 15, విద్యుత్ 2, ఆర్‌డబ్ల్యూఎస్ 1, ఐబీ 2, పీఆర్ ఏఈకి 1 చొప్పున మొత్తం 21 దరఖాస్తులు వచ్చినట్లు మండల ప్రత్యేక అధికారి విజయేందర్ రెడ్డి తెలిపారు. ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య, ఎంపీడీఓ జ్ఞానప్రకాశ్‌రావు, డీటీ సుకన్య, పలుశాఖల ఏఈలు జమీల్ అహ్మద్, నవీన్, ఆర్ఎస్‌జే కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నల్లగొండ రూరల్: నర్సింగ్‌బట్ల గ్రామం సర్వే నంబర్ 310లో నిరుపేదలకు కేటాయించిన భూమిని అధికార పార్టీ నాయకుల అండతో కొందరు ఆక్రమించి చదును చేస్తున్నారని సోమవారం ప్రజావాణిలో బీజేపీ నాయకులు తహసీల్దార్ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో పోతెపాక సాంబయ్య, చామకూరి మహేష్, కొత్తపల్లి వెంకట్, బాకి నర్సింహ తదితరులు ఉన్నారు.

ప్రజావాణిలో 21 దరఖాస్తులు

మర్రిగూడ: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 21 దరఖాస్తులను ప్రజల నుంచి స్వీకరించినట్లు మండల ప్రత్యేకాధికారి, ఏడీఏ ఎల్లయ్య తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ చినమునయ్య, సూపరింటెండెంట్ యాకుబ్, ఎంపీఓ రవికుమార్‌తోపాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లిలో 16 ఫిర్యాదులు

నార్కట్‌పల్లి : ప్రజావాణి కార్యక్రమంలో 16 ఫిర్యాదులు వచ్చినట్లు ఎంపీడీఓ ఉమేష్ తెలిపారు. అందులో 11 రెవెన్యూ మిగతావి వివిధ శాఖలకు సంబంధించిన ఫిర్యాదులని పేర్కొన్నారు.

ఘనంగా డాక్టర్స్ డే వేడుకలు



నకిరేకల్ : డాక్టర్లను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు



శాలిగౌరారం పీహెచ్‌సీలో వైద్యులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

చిట్యాల: గుండ్రాంపల్లి గ్రామంలోని వివేకానంద విద్యానికేతన్‌లో సోమవారం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన వైద్యుడు జి.సత్యనారాయణను ఆ పాఠశాల ఉపాధ్యాయులు సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ దోర్నాల శివ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నకిరేకల్ : లయన్స్, వాసవీ కపుల్స్ క్లబ్ ఆధ్వర్యంలో నకిరేకల్ పట్టణంలో సోమవారం డాక్టర్స్ డే వేడుకలను వేర్వేరుగా ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో డాక్టర్లను సన్మానించారు. లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ ఉప్పల వెంకటరమణ, క్లబ్ అధ్యక్షుడు బిచెనేపల్లి ప్రకాష్‌రావు, గుండా నరేందర్, గుండా గోపి, ప్రతినిధులు కందాల పాపిరెడ్డి, రాంమోహన్‌రావు, బొల్లం కృష్ణమూర్తి, రేపాల సతీష్, వీరవెల్లి రఘునాథ్, మీలా సత్యనారాయణ, చంద కృష్ణయ్య, వెంకన్న, మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాలిగౌరారం: డాక్టర్స్ డే వేడుకలు మండలంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు సూర్యశిల్ప, వాసంతి, పశు వైద్యురాలు శరణ్యలను శాలిగౌరారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛాలు, శాలువాలు, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు డెంకల సత్యనారాయణ, ప్రతినిధులు బుడిగె శ్రీనివాసులు, గుండ్ల రామ్మూర్తి, వడ్లకొండ భిక్షం, జోగు శ్రీను, విజయ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వీరేశానికి వినతి



వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

చిట్యాల: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు సోమవారం నకిరేకల్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వేముల వీరేశానికి వినతిపత్రం అందజేశారు. పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ స్కూల్‌కు అనుమతులు నిలుపుదల చేయాలని, అంగన్‌వాడీ టీచర్ల వేతనాలు పెంచి సకాలంలో అందించాలని కోరారు. ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల పోస్టులను భర్తీ చేయాలని, అంగన్‌వాడీ వంట గ్యాస్, కూరగాయల బిల్లులను వెంటనే చెల్లించాలని ఎమ్మెల్యేను కోరారు. దాడి అరుణ, అపర్ణ, బుజ్జమ్మ, జ్యోతి, శోభారాణి, కృష్ణవేణి, ధనమ్మ, లలిత, నాగరాణి, జానమ్మ, ధనలక్ష్మి పాల్గొన్నారు.

రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ

మర్రిగూడ : రైతు భరోసాపై పీఏసీఎస్ చైర్మన్ పందుల యాదయ్యగౌడ్, శివన్నగూడ ఎఫ్ఏసీఎస్ చైర్మన్ బాలం నరసింహ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో రైతుల అభిప్రాయాలు సేకరించారు. కార్యక్రమంలో మునుగోడు ఏడీఏ ఎల్లయ్య, ఏఓ హేమలత, ఏఈఓలు విజయ్‌కుమార్, పావని, శ్రీలత, సుజాత, సీఈఓ శ్రీనివాస్, డైరెక్టర్లు మారమ్మ, లింగయ్య, ముత్యాలు, అచ్చయ్య, బోడ్యా, ఏడుకొండలు, మల్లయ్య, రామాచారి, తేజస్వి, రామనర్సయ్య, మల్లిఖార్జున్, సందీప్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల వెంట చెట్లు నరికివేత



పిట్టంపల్లిలో రోడ్డు వెంట నరికివేసిన చెట్లు

చిట్యాల: మండలంలోని పిట్టంపల్లి గ్రామానికి వెళ్లే దారిలో పలుచోట్ల రోడ్డు వెంట ఉన్న చెట్లను విద్యుత్ సిబ్బంది సోమవారం నరికివేయించారు. ఏపుగా పెరిగిన చెట్లను జేసీబీలతో పూర్తి తొలగించి రోడ్డుపక్కల పడేశారు. విద్యుత్ తీగలకు అడ్డుగా ఏపుగా పెరిగాయని చెట్లను నరికివేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే తమ గ్రామం చుట్టుపక్కల పలు రసాయన పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యంతో ఇబ్బందులు పడుతుంటే పెరిగిన చెట్లను నరికివేయడం ఎంతవరకు సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు. చెట్లను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ మాజీ ఉప సర్పంచ్ మెట్టు పరమేష్ యాదవ్ కోరారు.